క్లుప్తంగా

రేపటి నుంచి వేసవి విజ్ఞాన శిబిరం

చీమకుర్తి: చీమకుర్తి గ్రంథాలయంలో ఈ నెల 8 నుంచి వచ్చే నెల 11వ తేదీ వరకు వేసవి విజ్ఞాన శిబిరం నిర్వహించనున్నట్లు లైబ్రేరియన్ కే సత్యనారాయణ ఆదివారం తెలిపారు. విద్యార్థులు పాల్గొని వేసవి సెలవులను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. 6 నుంచి 10వ తరగతి విద్యార్థులు పాల్గొనవచ్చన్నారు. ప్రతిరోజూ ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు కార్యక్రమాలు నిర్వహిస్తారన్నారు. కథలు చదివి వినిపించడం, పుస్తకాలు చదివించడం, కథలు చెప్పడం, డ్రాయింగ్, పెయింటింగ్, పేపర్‌క్రాఫ్ట్, డ్రామా, డ్యాన్స్ వంటి కార్యక్రమాలు నిర్వహిస్తారని వివరించారు. చీమకుర్తి పట్టణంతో పాటు చుట్టుపక్కల గ్రామాలకు చెందిన విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని లైబ్రేరియన్ కోరారు.

రెండు ద్విచక్ర వాహనాలు ఢీ.. పలువురికి గాయాలు

ముండ్లమూరు: మండలంలోని శంకరాపురం వద్ద దర్శి – అద్దంకి ప్రధాన రహదారిలో రెండు ద్విచక్ర వాహనాలు ఎదురెదురుగా ఢీకొనడంతో పలువురికి గాయాలయ్యాయి. ఆదివారం రాత్రి అద్దంకి కి చెందిన అనిల్‌కుమార్, బ్రహ్మయ్యలు ద్విచక్ర వాహనంపై ముండ్లమూరు వెళ్లి పనులు చూసుకొని తిరిగి అద్దంకి వెళ్తున్నారు. అదే సమయంలో ఎదురుగా వస్తున్న మరొక ద్విచక్ర వాహనం ఢీకొన్నాయి. ఐదుగురికి గాయాలయ్యాయి. హేమలత, ఓబులరెడ్డి, సుబ్బరామిరెడ్డిలను 108 వాహనంలో దర్శి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.


గాయాల పాలైన అనిల్‌కుమార్

వైభవంగా విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవం

- మడనూరులో సీతారామ లక్ష్మణ హనుమత్ విగ్రహాల ప్రతిష్ఠ
- పాల్గొన్న ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి


విగ్రహ ప్రతిష్ఠలో పాల్గొని పూజలు చేస్తున్న ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి

మడనూరు (కొత్తపట్నం): మడనూరు గ్రామంలోని అంబేడ్కర్‌నగర్‌లో సీతారామ లక్ష్మణ హనుమత్ విగ్రహాల ప్రతిష్ఠ మహోత్సవాన్ని ఆదివారం వైభవంగా నిర్వహించారు. ఒంగోలు ఎమ్మెల్యే, మాజీ మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డి ముఖ్య అతిథిగా హాజరై పూజల్లో పాల్గొన్నారు. సీతారామ లక్ష్మణ హనుమత్ స్వాములను దర్శనం చేసుకుని టెంకాయలు కొట్టి పూజలు చేశారు. అనంతరం స్థానికంగా ఉన్న అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి బాలినేని నివాళులర్పించారు. ఈ నెల 5వ తేదీ ప్రారంభమైన విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమాలు ఆదివారంతో ముగిశాయి. లింగారెడ్డి శంబుప్రసాద్‌రెడ్డి, కౌసల్యమ్మ దంపతులు, వైఎస్సార్ సీపీ గ్రామ అధ్యక్షుడు సామంతుల వీరారెడ్డి, వైస్ ఎంపీపీ శెట్టి కోటేశ్వరమ్మ, అంబేడ్కర్ నగర ప్రజలు, పెద్దల ఆధ్వర్యంలో ఆదివారం రత్నన్యాసము, గర్భ వ్యాసం, యంత్ర ప్రతిష్ఠ, కళావాహనం కూష్మాండబలి, కుంభబలి, స్వామివారి ప్రతిబింబ దర్శనం, కుంభాభిషేకం, నివేదన, హారతి, మంత్రపుష్పం, ఆశీర్వచనం, తీర్థప్రసాద వినియోగ కార్యక్రమాలు నిర్వహించారు. ప్రతిష్ఠ అనంతరం భారీగా అన్నదానం చేశారు. సీతారామ లక్ష్మణ హనుమత్ విగ్రహాల దర్శనం అనంతరం తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. ఆలయ కమిటీ సభ్యులు పర్యవేక్షించారు. కార్యక్రమంలో ఎంపీపీ లంకపోతు అంజిరెడ్డి, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు ఆళ్ల రవీంద్రరెడ్డి, రాష్ట్ర మత్స్యకార వెల్ఫేర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ వాయల సుమతి, సర్పంచ్ గంగవరపు కోటేశ్వరరావు, కన్వీనర్ సుదర్శ కోటేశ్వరరావు, వాయల రోశయ్య, అంబేడ్కర్ ఆశయ సాధన సమితి నాయకుడు బిల్లా చెన్నయ్య, బద్దేల ప్రమోద్‌రెడ్డి, రాతికింద బుల్లికోటయ్య, కసుకుర్తి ఏసురత్నం, దోనేపూడి గోవింద్, శెట్టి వెంకట్రావు, ఎం.రాంబాబు, బిల్లా శ్రీను, ఆర్.ప్రభాకర్, తమలపాకుల కిషోర్, చక్రవర్తి, రవీంద్ర, పి.వెంకటనారాయణ, బ్రహ్మేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.


ప్రతిష్ఠించిన సీతారామ లక్ష్మణ హనుమత్ విగ్రహాలు

మడనూరు సమస్యల పరిష్కారానికి కృషి...

మడనూరు గ్రామ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి హామీ ఇచ్చారు. విగ్రహాల ప్రతిష్ఠ అనంతరం స్థానిక బిల్లా చెన్నయ్య నివాసానికి వెళ్లిన ఎమ్మెల్యే.. మడనూరు గ్రామ సమస్యలు తెలుసుకున్నారు. సర్వే నంబర్ 648లో 4.5 ఎకరాల భూమిని జగనన్న లే అవుట్లకు కేటాయించారని, కొనుగోలు చేసి పట్టాలు మంజూరు చేయాలని, గ్రామం నుంచి శ్మశానానికి వెళ్లే దారి ఆక్రమణలో ఉందని, ఆక్రమణలు తొలగించి రోడ్డు వేయించాలని, మడనూరు సచివాలయం–2 భవనాన్ని నిర్మించాలని బిల్లా చెన్నయ్య, ఏసురత్నం, తదితరులు ఎమ్మెల్యే బాలినేని దృష్టికి తీసుకెళ్లారు. సమస్యలన్నీ పరిష్కరిస్తానని బాలినేని హామీ ఇచ్చారు.

ప్రతి విషయాన్ని బాలినేనికి ముడిపెట్టడం సరికాదు


మాట్లాడుతున్న మేయర్ గంగాడ సుజాత, పక్కన కమిషనర్, కార్పొరేటర్లు

- కొత్త కాంట్రాక్టర్ చేసిన తప్పుకు కూడా అభాండాలా..?
- పచ్చ మీడియాపై మండిపడిన ఒంగోలు నగర మేయర్ గంగాడ సుజాత

ఒంగోలు సబర్బన్: ప్రతి విషయాన్ని ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డికి ముడిపెట్టి పచ్చ మీడియా అసత్య కథనాలు ప్రచురించడం సరైన పద్ధతి కాదని ఒంగోలు నగర మేయర్ గంగాడ సుజాత ధ్వజమెత్తారు. ఒంగోలు నగర కమిషనర్ ఎం.వెంకటేశ్వరరావు, పలువురు కార్పొరేటర్లతో కలిసి స్థానిక కార్పొరేషన్ కార్యాలయంలోని కౌన్సిల్ హాలులో ఆదివారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ పచ్చమీడియా తన తీరు మార్చుకోవాలని హితవు పలికారు. వేసవిలో నగర ప్రజలకు ఉపశమనం కలిగించేందుకు, దాహం తీర్చేందుకు ఒంగోలు నగర పాలక సంస్థ ఆధ్వర్యంలో నాలుగు చలివేంద్రాలు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. కొత్త కాంట్రాక్టర్ కావడంతో ఫ్లెక్సీలలో ఏ ఫొటోలు వేయాలో తెలియక కొన్ని ముఖ్యమైన ఫొటోలు వేయలేదన్నారు. వెంటనే గమనించిన కార్పొరేషన్ అధికారులు ఫ్లెక్సీలు మార్చివేసి కొత్త ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారన్నారు. ఆ ఫొటోలు పెట్టలేదని పచ్చమీడియా వెంటనే దానిని కూడా బాలినేనికి ముడిపెట్టి కథనాలు ప్రచురించడం సరైన పద్ధతి కాదన్నారు. ఆ ఫ్లెక్సీల విషయంలో బాలినేని శ్రీనివాసరెడ్డికి ఎలాంటి సంబంధం లేదని వివరించారు. విలేకరుల సమావేశంలో కార్పొరేటర్లు ఈదర వెంకట సురేష్‌బాబు, ఇమ్రాన్‌ఖాన్, యనమల నాగరాజు పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణపై మాయావతి స్పష్టమైన ప్రకటన చేయాలి


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ మున్నంగి నాగరాజు మాదిగ

ఒంగోలు: ఎస్సీ వర్గీకరణపై బీఎస్పీ అధినేత మాయావతి స్పష్టమైన ప్రకటన చేయాలని ఎంఆర్‌పీఎస్ జాతీయ అధ్యక్షుడు డాక్టర్ మున్నంగి నాగరాజు మాదిగ డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక అంబేడ్కర్ భవన్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. హైదరాబాద్‌లో తెలంగాణ భరోసా యాత్రకు వస్తున్న మాయావతి.. ముందుగా తన సామాజికవర్గమైన మాదిగలకు వర్గీకరణ విషయంలో భరోసా కల్పించి చిత్తశుద్ధి నిరూపించుకోవాలన్నారు. అప్పుడే 2024 ఎన్నికల్లో బీఎస్పీలో కలిసి ఎంఆర్‌పీఎస్, ఎంఎస్పీ పనిచేస్తాయని ప్రకటించారు. అగ్రవర్ణాల పేదలకు 10 శాతం రిజర్వేషన్లు కల్పించే అంశంపై మద్దతు ప్రకటించిన మాయావతి.. షెడ్యూల్డు కులాల వర్గీకరణ విషయంలో తెలంగాణ భరోసా సభలో సానుకూల నిర్ణయం తీసుకుని ఎంఆర్‌పీఎస్‌కు మద్దతు ప్రకటించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో మహజన సోషలిస్టు పార్టీ ప్రకాశం జిల్లా కన్వీనర్ తోరటి ఆనంద్‌మాదిగ, ఎంఈఎఫ్ జాతీయ ఉపాధ్యక్షుడు బొంత ఏసుదాస్ మాదిగ, రాష్ట్ర నాయకులు సర్వేపల్లి రవిరాజ్ మాదిగ, ఎంఎస్పీ రాష్ట్ర నాయకుడు పాలడుగు రమేష్ తదితరులు పాల్గొన్నారు.

15న అరుణాచలానికి ప్రత్యేక బస్సు

మార్కాపురం టౌన్: అరుణాచల పుణ్యక్షేత్రానికి మార్కాపురం ఆర్టీసీ డిపో ద్వారా ఈ నెల 15న ప్రత్యేక బస్సు సర్వీస్ ఏర్పాటు చేసినట్లు డిపో మేనేజర్ ఏఎస్ నరసింహులు తెలిపారు. 15వ తేదీ రాత్రి 9 గంటలకు మార్కాపురం నుంచి బయల్దేరి కానిపాకం, తిరుత్తణి, కంచి మీదుగా అరుణాచలం వెళ్తుందని, గిరి ప్రదక్షిణ అనంతరం 17వ తేదీ బయల్దేరి గోల్డెన్ టెంపుల్ దర్శనం తర్వాత మార్కాపురం చేరుకుంటుందని వివరించారు. చార్జీ రూ.2500గా నిర్ణయించినట్లు తెలిపారు. భక్తులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు.

వైభవంగా బాలనాగేంద్రస్వామి తిరునాళ్లు

కారంచేడు: మండలంలోని ఆదిపూడిలో కొలువైన శ్రీవల్లీ దేవసేన సమేత బాల నాగేంద్రస్వామి వారి 36 వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని గ్రామంలో పెద్ద ఎత్తున తిరునాళ్లు నిర్వహించారు. ఉదయం నుంచి స్వామి వారి దర్శనానికి గ్రామంతో పాటు సమీప గ్రామాలైన యర్రంవారిపాలెం, తిమిడెదపాడు, పూసపాడు, నూతలపాడు, సుబ్బారెడ్డిపాలెం, కుర్రప్పాలెం, వంకాయలపాడు గ్రామాలకు చెందిన భక్తులు పెద్ద ఎత్తున తిరునాళ్లకు వచ్చి స్వామి వారిని దర్శించుకొని ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా ఉండేందుకు ఆలయ అభివృద్ధి కమిటీ, యూత్ కమిటీ సభ్యులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. పెద్ద ఎత్తున అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు.

నాగండ్లలో నేత్రదానం

చినగంజాం: ఇంకొల్లు మండలం నాగండ్లలో ఆదివారం మృతి చెందిన గాలి సుబ్బారావు(66) నేత్రదానంతో రోటరీ క్లబ్ ఆఫ్ ఇంకొల్లు అవయవదాన కమిటీ ఆయన కుటుంబ సభ్యులు అంగీకారంతో నిర్వహించిన కార్నియాల సేకరణతో 499 వ నేత్రదానం పూర్తయింది. గుంటూరు పెదకాకాని శంకర నేత్రాలయ నేత్ర వైద్యులు డాక్టర్ విపిన్, సిస్టర్ వాణిలు దాత కార్నియాలను సేకరించారు. దాత కుటుంబ సభ్యులు మరియమ్మ, రాజశేఖర్,ఏమేలమ్మ, సుభాషిణిలను ఇంకొల్లు సెంట్రల్ క్లబ్ రోటరీ అవయవదాన కమిటీ సభ్యులు సోమేపల్లి రామ్మోహనరావు, జెట్టి వెంకటేశ్వర్లు(స్వామి), క్లబ్ అధ్యక్ష, కార్యదర్శి, ట్రెజరర్‌లు భవనం అంజిరెడ్డి, కరి కమలేశ్వరరావు, వంకాయలపాటి శ్రీమన్నారాయణలు అభినందించారు.

శింగరకొండ దర్శిని

అద్దంకి: శోభకృతు నామ సంవత్సరం. ఉత్తరాయణం వైశాఖ మాసం జ్యేష్ఠ నక్షత్రం తదియ తిథి సందర్భంగా సోమవారం ప్రత్యేక పూజలు చేస్తారని దేవస్థాన ఏసీ సుభద్ర ఆదివారం తెలిపారు. ఉదయం 5గంటలకు సుప్రభాత సేవ, 5.30 గంటలకు బిందె తీర్థం. మధ్యాహ్నం 1.00 గంట నుంచి 1.30 గంట వరకు పంచ హారతుల పూజ నిర్వహిస్తారు. రాత్రి 7 గంటల నుంచి 7.45 గంటల వరకు జరిగే ప్రదోషకాలార్చన అనంతరం ఆలయం మూసివేస్తారు.

మోటుమాల కేజీబీవీలో నూరుశాతం ఉత్తీర్ణత

- 31 మంది పదో తరగతి పరీక్షలు రాయగా, 27 మందికి ఫస్ట్‌క్లాస్


విద్యార్థినులకు స్టడీ అవర్ నిర్వహిస్తున్న ఎస్‌వో అరుణకుమారి (ఫైల్)

కొత్తపట్నం: మండలంలోని మోటుమాల గ్రామంలో గల కేజీబీవీలో పదో తరగతి విద్యార్థులు నూరు శాతం ఉత్తీర్ణత సాధించారు. ప్రైవేటు పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలు ఉన్నట్లు నిరూపించారు. ఈ పాఠశాల నుంచి మొత్తం 31 మంది విద్యార్థులు పరీక్షకు హాజరవగా, అందరూ పాసవ్వడంతో పాటు 27 మంది ఫస్ట్‌క్లాస్ సాధించారు. ముగ్గురు సెకండ్ క్లాస్‌లో, ఒకరు పాస్ మార్కులతో నూరు శాతం ఉత్తీర్ణులయ్యారు. గంగవరపు మమత 558 మార్కులతో పాఠశాల స్థాయిలో మొదటి ర్యాంక్ సాధించింది. ఉపాధ్యాయులు క్రమశిక్షణతో కూడిన విద్యనందించడం, పాఠశాల అనంతరం కూడా స్టడీ అవర్స్ నిర్వహించడం ద్వారా నూరుశాతం ఉత్తీర్ణత సాధ్యమైనట్లు ఎస్‌వో అరుణ కుమారి తెలిపారు. ప్రతి విద్యార్థిపై వ్యక్తిగత శ్రద్ధ తీసుకుని కష్టపడి చదించామన్నారు. వారం వారం పరీక్షలు నిర్వహించి వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నట్లు తెలిపారు.

దామోదరం సంజీవయ్య అందరికీ ఆదర్శం


సంజీవయ్యకు నివాళులర్పిస్తున్న సాహిత్య, సాంస్కృతిక సంస్థల ప్రతినిధులు

ఒంగోలు: మాజీ ముఖ్యమంత్రి దామోదరం సంజీవయ్య ప్రతిఒక్కరికీ ఆదర్శమని నాగినేని మెమోరియల్ ఆర్ట్స్ అసోసియేషన్ అధ్యక్షుడు మిడసల మల్లికార్జునరావు కొనియాడారు. సంజీవయ్య వర్ధంతిని పురస్కరించుకుని అసోసియేషన్ ఆధ్వర్యంలో స్థానిక సీవీఎన్ రీడింగ్ రూం ఆవరణలో ఆదివారం సంస్మరణ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు మిడసల మల్లికార్జునరావు, కనుమాల రాఘవులు మాట్లాడుతూ తన చివరి క్షణం వరకు బడుగు, బలహీన వర్గాల కోసం, రాష్ట్ర సర్వతోముఖాభివృద్ధి కోసం పాటుపడిన దార్శనికుడు సంజీవయ్య అని అన్నారు. దళిత జాతి ఆణిముత్యమైన సంజీవయ్య ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రెండో ముఖ్యమంత్రిగా విశేష సేవలు అందించారని కొనియాడారు. కృష్ణదేవరాయ సాహిత్య సాంస్కృతిక సేవా సమితి అధ్యక్షుడు, రైతు సంఘ నాయకుడు చుండూరి రంగారావు, డాక్టర్ సంతవేలూరి కోటేశ్వరరావు, వాకా సంజీవరెడ్డి, అంగలకుర్తి ప్రసాద్, ధేనువుకొండ సుబ్బయ్య, యూవీ రత్నం తదితరులు పాల్గొన్నారు.

కనుల పండువగా వేణుగోపాలుడి కల్యాణం


వేణుగోపాలుని కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు


స్వామివారి రథోత్సవంలో పాల్గొన్న భక్తులు

నాగులుప్పలపాడు: మండలంలోని ఉప్పుగుండూరు గ్రామంలో రుక్మిణీ సత్యభామ సమేత వేణుగోపాల స్వామి బ్రహ్మోత్సవాల సందర్భంగా ఆదివారం స్వామివారి కల్యాణాన్ని అత్యంత వైభవంగా నిర్వహించారు. ఆలయ పూజారి దివి శ్రీధర్‌బాబు కల్యాణ ఘట్టాన్ని అశేష భక్త జనసందోహం మధ్య శాస్త్రోక్తంగా వేద మంత్రాల నడుమ నిర్వహించారు. ఆలయ ఈవో మీనిశెట్టి శ్రీనివాసరావు దంపతులు స్వామివారికి పట్టువస్త్రాలు సమర్పించారు. కల్యాణ ఘట్టంలో గ్రామ పెద్దలు, ఆలయ చైర్మన్ పెంట్యాల జ్యోతి శ్రీనివాసరావు, కొంజేటి సురేష్, సొసైటీ అధ్యక్షుడు ఉప్పుగుండూరి శ్రీనివాసప్రసాద్ పాల్గొన్నారు. కల్యాణం సందర్భంగా భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా దేవదాయ ధర్మాదాయ శాఖ ఆధ్వర్యంలో ప్రత్యేక ఏర్పాట్లు చేయడంతో పాటు వివేకానంద సేవా సమితి ఆధ్వర్యంలో మజ్జిగ పంపిణీ చేశారు. సాయంత్రం తెలగ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన రథోత్సవంలో భక్తులు పాల్గొని తిలకించారు. స్వామివారి రథం లాగడానికి యువకులు ఉత్సాహం చూపారు.

కుర్తాళం పీఠంతో మాకు సంబంధం లేదు

- స్వామీజీనే స్వయంగా చెప్పారు
- మళ్లీ పీఠం పేరుతో పంపిన ప్రతిపాదనను తిరస్కరిస్తున్నాం
- మీడియా సమావేశంలో షిర్డీ సాయి కల్చరల్ మిషన్ అధ్యక్షురాలు సుబ్బలక్ష్మి


విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న లాయరుపేట సాయిబాబా ఆలయం షిర్డీ సాయి కల్చరల్ మిషన్ కమిటీ సభ్యులు

ఒంగోలు: స్థానిక లాయరుపేటలోని సాయిబాబా ఆలయానికి కుర్తాళం పీఠంతో ఎటువంటి సంబంధం లేదని షిర్డీ సాయి కల్చరల్ మిషన్ అధ్యక్షురాలు సుబ్బలక్ష్మి తెలిపారు. ఆదివారం స్థానిక ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. గతంలో తెలుగుదేశం ప్రభుత్వం ఉన్న సమయంలో ఆదాయం ఎక్కువగా వచ్చే ఆలయాలను దేవదాయశాఖలో విలీనం చేస్తుండటంతో ఆలయ నిర్వహణ బాధ్యతకు సంబంధించి కుర్తాళం పీఠంతో సంబంధం కలిగి ఉన్నామన్నారు. అంతే తప్ప ఆలయ ఆస్తులతో, ఆదాయంతో కుర్తాళం పీఠంకు ఎటువంటి సంబంధం లేదన్నారు. అయితే, ఇటీవల కుర్తాళం పీఠం నుంచి పలు నిబంధనలు రావడంతో వాటిని తాము వ్యతిరేకిస్తున్నామని, అవి తమ షిర్డీ సాయి కల్చరల్ మిషన్ బైలాస్‌కు వ్యతిరేకంగా ఉన్నాయని తెలిపామన్నారు. ప్రధానంగా ఆలయ ఆదాయం రూ.6 లక్షల నుంచి రూ.7 లక్షలు వస్తుండగా, దానిని రూ.25 లక్షలకు పెంచాలని సూచించడం, వచ్చిన ఆదాయంలో 20 శాతం కుర్తాళం పీఠానికి పంపాలని సూచించడం, ఆలయంలో నిర్వహించే ఏ కార్యక్రమమైనా కుర్తాళం పీఠం మహాస్వామి అనుమతితోనే జరగాలనడం, ఆలయంలోని ప్రతి విగ్రహం వద్ద మహాస్వామి చిత్రపటం ఉంచాలనడం వంటి అనేక సూచనలను తమ కల్చరల్ మిషన్ వ్యతిరేకించిందన్నారు. ఈ నిబంధనలు భక్తుల మనోభావాలను దెబ్బతీసే విధంగా ఉన్నాయన్నారు. దీనిపై కుర్తాళం పీఠాధిపతి ఇటీవల ఒంగోలు వచ్చి తమ మందిరంలో ట్యాక్స్ విషయంపై ప్రస్తావించడంతో తమ కమిటీలోని 16 మంది సభ్యులలో 12 మంది అంగీకరించలేదన్నారు. దీంతో మహాస్వామి వెంటనే ఇకనుంచి కుర్తాళం పీఠంతో సాయిబాబా ఆలయానికి ఎటువంటి సంబంధం ఉండదని ప్రకటించారన్నారు. ఆలయ కమిటీ ప్రతినిధి ముని కృష్ణయ్యను కూడా తొలగిస్తున్నట్లు ప్రకటించి మీరే స్వచ్ఛందంగా నిర్వహించుకోవాలని తమకు సూచించారన్నారు. అయితే, తాజాగా కుర్తాళం పీఠం చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ మోచర్ల శశిభూషణ్ తమను ఒప్పందంపై సంతకాలు చేయాలని ఒత్తిడి చేస్తున్నారని, దానిని తాము తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామని తెలిపారు. అంతేగాకుండా మందిర చైర్మన్, మేనేజర్లను లాకర్ తాళాలు ఇవ్వాలని, లేకపోతే పోలీసు కేసు పెడతామని కార్యదర్శి హరిప్రియ హెచ్చరిస్తున్న నేపథ్యంలో భక్తులకు వాస్తవాలు తెలియజేసేందుకు ఈ సమావేశం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. విలేకరుల సమావేశంలో పాల్గొన్న శృంగేరి పీఠం ప్రతినిధి సాంబశివానందభారతి మాట్లాడుతూ మహాస్వామి దృష్టికి విషయాలు తెలియనివ్వకుండా కుర్తాళం పీఠంలో అక్రమాలు జరుగుతున్నట్లు ఆరోపించారు. ఆధారాలతో సహా తాను సమర్పించినా మహాస్వామి నిస్సహాయ స్థితి కారణంగా అక్రమాలు పెరిగిపోతున్నాయన్నారు. ఈ నేపథ్యంలోనే లాయరుపేట సాయిబాబా మందిరం సభ్యులు చేస్తున్న పోరాటానికి నైతిక మద్దతు పలికేందుకు తాను విలేకరుల సమావేశంలో పాల్గొన్నట్లు తెలిపారు. విలేకరుల సమావేశంలో సంయుక్త కార్యదర్శి జయరాం, మాజీ కార్యదర్శి గోపాలరావు, సభ్యులు హరనాథరెడ్డి, సాయిరాజ్, విజయ్ శివకుమార్, చంద్రారెడ్డి పాల్గొన్నారు.

కమిటీని తొలగించినట్లు ప్రకటించిన సిద్దేశ్వరి పీఠం...

కుర్తాళం సిద్దేశ్వరి పీఠ పాలిత షిర్డీసాయి కల్చరల్ మిషన్ మరియు ట్రస్టును 1997లో కుర్తాళ పూర్వ పీఠాధిపతులు శ్రీశ్రీశ్రీ శివ చిదానందభారతిస్వామివారు స్వీకరించారని పీఠం అదనపు కార్యదర్శి స్వామిశ్రీ పూర్ణజ్ఞానానంద సరస్వతి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. వారు సిద్ధిపొందిన తర్వాత 2002 సంవత్సరం నుంచి కుర్తాళ ప్రస్తుత పీఠాధిపతులైన జగద్గురువులు శ్రీశ్రీశ్రీ సిద్దేశ్వరానందభారతిస్వామి వారి పరిపాలనలో ఉందన్నారు. కొంత కాలంగా మందిర దైనందిన కార్యక్రమాల కోసం స్వామివారు ఏర్పాటుచేసిన కమిటీలో సభ్యులు అక్రమాలకు, దుర్మార్గాలకు పాల్పడటంతో పాటు పీఠం వ్యతిరేక కార్యక్రమాలకు పాల్పడుతుండడంతో స్వామివారు వారందరినీ పదవుల నుంచి తొలగించడం జరిగిందన్నారు. తొలగించబడిన కమిటీ సభ్యులు తప్పుడు మార్గంలో దౌర్జన్యంగా మందిరంలో ఉన్న పీఠం పేర్లను తొలగించి మందిరాన్ని ఆక్రమించాలని యత్నిస్తున్నారన్నారు. వారిపై చట్టపరమైన చర్యలు కూడా తీసుకోవడం జరుగుతుందని, భక్తులు అసత్య ప్రచారాన్ని, వదంతులను విని ఆందోళన చెందవద్దని అన్నారు. ఈ మందిరం కుర్తాళం పీఠ పరిపాలనలోనే ఉందని, భక్తులందరూ సంయమనంతో ఉండాలని తెలిపారు.

ఎర్రపల్లెలో పర్యటించిన మాజీ ఎంపీ మేకపాటి


రాజమోహన్‌రెడ్డిని స్వాగతిస్తున్న నాయకులు

కొమరోలు: మండలంలోని ఎర్రపల్లె గ్రామంలో నెల్లూరు మాజీ ఎంపీ మేకపాటి రాజమోహన్‌రెడ్డి ఆదివారం పర్యటించారు.

ఈసందర్భంగా గిద్దలూరు నియోజకవర్గ వైఎస్సార్ సీపీ నాయకులు కామూరి రమణరెడ్డి మేకపాటి రాజమోహన్‌రెడ్డి సాదరంగా ఆహ్వానించారు. కొద్దిసేపు తాజా రాజకీయ పరిస్థితులపై చర్చించారు. బేస్తవారపేట ఎంపీపీ ఓసూరారెడ్డి, వైఎస్సార్ సీపీ నాయకులు అక్కిపుల్లారెడ్డి, రామనారాయణరెడ్డి పాల్గొన్నారు.

సర్పంచ్ ఆత్మహత్య

దర్శి: మండలంలోని రామచంద్రపురం గ్రామ సర్పంచ్ బాదం ధనలక్ష్మి ఆదివారం సాయంత్రం ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నారు. ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరేసుకున్నట్లు తెలుస్తోంది. ధనలక్ష్మి మృతితో ఆమె కుటుంబ సభ్యులు ,గ్రామస్తులు కన్నీరు మున్నీరుగా విలపిస్తున్నారు. ఆమె కుమారుడు,కుమార్తె ఉద్యోగాలు చేస్తున్నారు. ధనలక్ష్మి మృతికి గల కారణాలు తెలియరాలేదు.

హజ్ యాత్రికులపై అదనపు భారం తొలగించాలి


మాట్లాడుతున్న హజ్ యాత్రికులు

ఒంగోలు: హజ్ యాత్రికులపై అదనపు భారాన్ని తొలగించాలని హజ్ యాత్రికులు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఆదివారం మధ్యాహ్నం స్థానిక ఒంగోలు ప్రెస్‌క్లబ్‌లో జానీబాషా, తదితరులు విలేకరుల సమావేశం నిర్వహించి మాట్లాడారు. ముస్లింలు జీవితంలో ఒక్కసారైనా మక్కాను దర్శించుకోవాలని భావిస్తారన్నారు.

అటువంటి యాత్రకు ప్రతి ఏటా హజ్ యాత్రికులు ఆంధ్రప్రదేశ్ నుంచి 2 వేలమందికిపైగా వెళ్తుంటారన్నారు. ఇందుకుగానూ ఇమ్మిగ్రేషన్ పాయింట్ హైదరాబాదులో ఉండేదన్నారు. తాజాగా ఇమ్మిగ్రేషన్ పాయింట్‌ను విజయవాడలో కూడా ఏర్పాటుచేస్తూ సెంట్రల్ హజ్ కమిటీ ప్రకటించడంతో ఆనందించామన్నారు. కానీ, ఆ ఆనందం కాస్తా తాజా ప్రకటనతో ఆవిరైందన్నారు. హైదరాబాదులో ఇమ్మిగ్రేషన్ చేయించుకున్నవారికి చార్జీ రూ.53,373 ఉంటే.. విజయవాడ నుంచి రూ.1,36,780గా ఉందన్నారు. ఇమ్మిగ్రేషన్ పాయింట్ నూతనంగా పెట్టారంటూ తమపై ఒక్కొక్కరి వద్ద నుంచి రూ.83,407 అదనంగా వసూలు చేయడాన్ని తాము తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామన్నారు. ఏపీ నుంచి ఈ ఏడాది 2,200 మంది వెళుతున్నారని, తద్వారా రూ.16 కోట్ల భారం పడనుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇమ్మిగ్రేషన్ పాయింట్ వల్ల అదనపు భారం పడుతుందంటే దానిని తీసివేసినా తమకు సమ్మతమేనని, అంతే తప్ప అదనపు భారం మాత్రం ఉండరాదన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్పందించి తమ సమస్యకు పరిష్కారం చూపాలని కోరారు.